సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
బుధవారం ¦ 6 ¦ ఆగస్టు ¦ 2025



ఎన్నికలకు దూరంగా 'సహకారం'

సహకార సంఘాలకు 12 ఏళ్లుగా ఎన్నికలు నిర్వహించలేదు. పాలకవర్గాల స్థానంలోని కమిటీలు ఆయా ప్రాంతంలోని ఎమ్మెల్యేల సిఫారసుతోనే ఏర్పడుతున్నాయి. -10లో



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

కమలాపురం మండలం నల్లలింగాయపల్లెలోని డీఏవీ భారతి పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి నరేష్ రాష్ట్ర స్థాయి జావెలిన్ త్రో పోటీలకు ఎంపికయ్యారు. -10లో

గరిష్టం/కనిష్టం
36.9 /26.2

వాతావరణం

జిల్లాలో మంగళవారం 26.2 - 36.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

కొనసాగుతున్న వర్షాలు

కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం కొండాపురంలో అత్యధికంగా 20.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే సింహాద్రిపురంలో 10.6 మి.మీ, లింగాలలో 9.2, జమ్మలమడుగులో 4.2, మైలవరంలో 3.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

నకిలీ సర్టిఫికెట్స్‌పై విజి'లెన్స్'

కడప రూరల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న కొంత మంది సిబ్బంది బోగస్ సర్టిఫికెట్స్ ద్వారా ఉద్యోగాలు కల్పించారన్న అంశంపై ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై 'సాక్షి' పలు కథనాలు ప్రచురించింది. ఈ అంశానికి సంబంధించి విజిలెన్స్ శాఖ విచారణ చేపడుతోంది. అందులో భాగంగా ఆ శాఖ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అందుకు సంబంధించిన ఫైల్స్‌ను తీసుకెళ్లి విజిలెన్స్ అధికారులకు అందజేసినట్లుగా తెలిసింది. విచారణ అనంతరం వెలువడే అంశాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

డిగ్రీ ఇన్‌స్టెంట్ పరీక్షల తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీసీ అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయ కేంద్రంగా జిల్లాలోని అన్ని డిగ్రీ కళాశాలల విద్యార్థులకు సెమిస్టర్ ఇన్‌స్టెంట్ పరీక్షలను మంగళవారం విశ్వవిద్యాలయ ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయ ప్రాంగణంలో ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కే ఎస్‌వీ కృష్ణారావుతో కలిసి పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. దీంతోపాటు పరీక్షా కేంద్రంలో వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణలో తీసుకుంటున్న జాగ్రత్తలను అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ టి.లక్ష్మీ ప్రసాద్ వివరించారు. 278 మంది పరీక్షలకు హాజరు కాగా, ఏడుగురు విద్యార్థులు గైర్హాజరు అయ్యారని కృష్ణారావు తెలిపారు.

ప్రతిష్టాత్మకంగా పీ4 అమలు

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఈ అంశంపై కలెక్టర్లతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో ఈ నెల 19వ తేదీ నుంచి పీ4 అమలు చేయాలన్నారు. జిల్లాలో పేదరిక నిర్మూలనకు చేపడుతున్న పీ4 లక్ష్యాన్ని 2029 నాటికి సాకారం చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బంగారు కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలే లక్ష్యమన్నారు. సమాజానికి తిరిగి ఇవ్వాలన్నదే ప్రధాన ఉద్దేశంతో.. మార్గదర్శుల నుంచి అందే చిన్న ఆసరా పేదలకు కొండంత అండ అవుతుందన్నారు. డబ్బుతోపాటు సాయం చేసే వారు కూడా మార్గదర్శులే అని, ఆ దిశగా మార్గదర్శులను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ అదితిసింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'పోషకాహారం'పై ఒప్పందం



ఐఎస్‌బీతో కుదిరిన అవగాహన ఒప్పందాన్ని చూపుతున్న కలెక్టర్

కడప సెవెన్‌రోడ్స్: సాంకేతిక మద్దతు ద్వారా పోషకాహారం-వ్యవసాయ కన్వర్జెన్స్‌ను ప్రారంభించడం (ఎనాక్ట్) అనే కార్యక్రమాన్ని జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టేందుకు జిల్లా పరిపాలన యంత్రాంగం, ఇండియన్ స్కూలు ఆఫ్ బిజినెస్ హైదరాబాదు మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. మంగళవారం కలెక్టర్ శ్రీధర్ తన చాంబర్‌లో డిజిటల్ సైన్ చేసిన అవగాహన ఒప్పంద పత్రాన్ని ఐఎస్‌బీ బీఐపీపీ అసోసియేట్ ప్రొఫెసర్ అండ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశ్విని ఛాత్రేకి సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐఎస్‌బీ, బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ ద్వారా సమకూరే నిధులతో సాంకేతిక మద్దతు ద్వారా పోషకాలు అధికంగా ఉండే ఆహార పదార్థాల లభ్యత, అందుబాటు, పౌష్టిక సామర్థ్యాన్ని మెరుగు పరిచేందుకే ఈ ప్రాజెక్టును జిల్లాలో అమలు చేస్తున్నామన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, మధ్యాహ్న భోజన పథకం, గర్భిణులు, బాలింతలకు అవసరమైన సంపూర్ణ పోషణ కోసం ఆహార పంటల ఉత్పత్తిని పెంపొందించే దిశగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఎస్‌హెచ్‌జీలు, రైతులు, అంగన్వాడీ కార్యకర్తలు ప్రాజెక్టులో భాగస్వాములు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఎనాక్ట్ ప్రతినిధులు వైష్ణవి, శృతి, డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మహేశ్వరకుమార్, ఐసీడీఎస్, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూటమికి పోలీస్ బైండోవర్

ఖాకీకి 'పసుపు' మరక అంటుకుంటోంది. అధికార పార్టీ నాయకులకు నాలుగో సింహం దాసోహమవుతోంది. వారు చెప్పిందే వేదంగా.. ప్రతిపక్ష పార్టీ నాయకులపై జూలు విదిలిస్తోంది. అడ్డదారులు తొక్కి అయినా.. కేసుల్లో ఇరికించాలని చూస్తోంది. టీడీపీ బడా నేతల వద్ద మార్కులు కొట్టేసే పనిలో నిమగ్నమైంది. ఇదంతా చూస్తున్న సామాన్య జనం.. ఇదేం పోకడ అని ఆశ్చర్యపోతున్నారు.

- వైఎస్సార్‌సీపీ నేతలపై బైండోవర్ కేసులు
- బీటెక్ రవి ఒత్తిడికి తలొగ్గుతున్న పోలీసులు
- విశ్వనాథరెడ్డి ఫిర్యాదు మేరకు మరికొందర్ని లాగేందుకు సన్నాహాలు
- వ్యవస్థలను ముందుపెట్టి పబ్బం గడుపుకునే పనిలో పడ్డ టీడీపీ



సాక్షి ప్రతినిధి, కడప: ఓ చిన్న ఉప ఎన్నిక.. అదీ పది వేల ఓట్ల ఎన్నిక.. ఎటువంటి బలం లేకపోయినా.. ఎలాగోలా అధికారాన్ని అడ్డుపెట్టుకుని గెలవాలని, అడ్డదారులు ఎంచుకుంది కూటమి సర్కార్. పులివెందులలో ప్రజాబలం కంటే పోలీసు బలాన్నే నమ్ముకొని ఎన్నికలు నడిపిస్తున్నారు. వైఎస్సార్సీపీలో కీలకంగా ఉన్న నేతలను టార్గెట్ చేస్తూ వేధింపులు ప్రారంభించారు. ఇప్పటికే పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీలో కీలకంగా ఉన్న నాయకులపై బైండోవర్ కేసులు పెట్టడం చర్చనీయాంశంగా మారింది.

స్థానికంగా బలం లేకపోయినా..

పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో పోటీకి దిగిన టీడీపీ అభ్యర్థి, బీటెక్ రవి సతీమణి మారెడ్డి లత పులివెందుల మండలమే కాదు. స్థానిక బలం లేకపోయినా అధికారం ఉంది కదా అని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తుమ్మల హేమంత్‌రెడ్డిపై పోటీకి దిగారు. ఇక ప్రజా బలం లేదు కాబట్టి ఎలాగైనా ఈ ఎన్నికల్లో గెలిచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడ్డాలో గెలిచాం అని చెప్పుకోవాలనే తాపత్రయం.. పులివెందుల నుంచి అమరావతి వరకూ టీడీపీ ప్రధాన నేతల్లో ఉంది. ఆపై అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. మొన్నటికి మొన్న సోమవారం అసలు పులివెందులలోనే లేని వ్యక్తులపై తప్పుడు ఫిర్యాదు చేయించారు. వైఎస్సార్‌సీపీ తరఫున ఉన్న వైస్ ఎంపీపీ విశ్వనాథ్‌రెడ్డిని లోబర్చుకుని తప్పుడు కేసులు పెట్టిస్తున్నారు. స్థానికంగా అందుబాటులో లేని, హైదరాబాద్‌కు పరిమితమైన వైఎస్ భాస్కరరెడ్డి, దేవిరెడ్డి శంకర్‌రెడ్డిపై కేసు నమోదు చేయించారు. ఈ ఫిర్యాదులో పేర్కొనని వ్యక్తులను కూడా అందులో చేర్చేందుకు రంగం సిద్ధం చేశారు. నల్లపురెడ్డిపల్లెకు చెందిన అచ్చుకట్ల భాస్కరరెడ్డి లాంటి వారిని కూడా కేసులో చేర్చే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇలా మాట వినని, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయానికి కృషి చేసే నాయకులపై వేధింపులు ముమ్మరం చేస్తున్నారు.

వేములలో వేల్పుల రామలింగారెడ్డిపై బైండోవర్

పులివెందుల సబ్ డివిజన్ పరిధిలో అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలోని వైఎస్సార్‌సీపీ నేతలపై బైండోవర్ కేసులు నమోదు చేసేందుకు పోలీసులు సన్నాహాలు చేస్తున్నారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ నేత వేల్పుల రామలింగారెడ్డిపై వేముల పోలీసులు బైండోవర్ కేసు నమోదు చేశారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలు నిర్వహిస్తే వేముల, వేంపల్లి, తొండూరు, సింహాద్రిపురం, లింగాల, చక్రాయపేట పోలీసు స్టేషన్‌లలో కూడా అక్కడి నేతలపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారు. ముందస్తు జాగ్రత్త రీత్యా అనుకున్నా.. ఇరుపక్షాల నాయకులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలి. ఇప్పటి వరకూ ఒక్క టీడీపీ నాయకుడిపై కూడా బైండోవర్ కేసు నమోదు కాలేదు. పులివెందులతోపాటు పక్క మండలాలల్లో కూడా వైఎస్సార్‌సీపీ నేతల్ని బైండోవర్ చేస్తుండటం గమనార్హం. ఒక్క పులివెందుల మండలంలో ఇప్పటికే సుమారు 80 మందిని బైండోవర్ చేసినట్లు సమాచారం. టీడీపీ నుంచి ఒక్కరంటే ఒక్కర్ని కూడా బైండోవర్ చేయకపోవడం విశేషం.

ఎలాంటి కేసులు లేకపోయినా...

జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని, అలా కుదరకపోతే కనీసం వైఎస్సార్‌సీపీ మెజార్టీని అయినా తగ్గించాలని టీడీపీ, బీజేపీ నేతలు జట్టుకట్టి మరీ పావులు కదుపుతున్నారు. ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేయడం కంటే.. వైఎస్సార్‌సీపీ వారిని టార్గెట్ చేయడమే పనిగా పెట్టుకున్నారు. మంగళవారం ఉదయం నుంచి పల్లెల్లో వైఎస్సార్‌సీపీ నాయకులపై బైండోవర్ కేసులు ప్రారంభించారు. ఎన్నిక రోజు కీలక నాయకులను బయటకు రాకుండా చేయాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. మరో వైపు అసలు పోలీసు రికార్డుల్లోనే ఎటువంటి కేసూ లేని వ్యక్తులను కూడా స్టేషన్లకు పిలిచి వేధింపులకు దిగుతున్నారు. అలాంటి వారిపై కూడా అన్యాయంగా బైండోవర్ కేసులు పెడుతున్నారు. బైండోవర్ కేసులు నమోదు అయిన వ్యక్తులు పోలింగ్ ఏజెంట్లుగా కూర్చునేందుకు అభ్యంతరం పెట్టడమే ప్రధాన లక్ష్యంగా కన్పిస్తోంది. 'మీరెన్ని కేసులు పెట్టినా, ఎంత మందిని బైండోవర్ చేసినా ప్రజాబలంతో విజయదుందుభి మోగిస్తాం' అని వైఎస్సార్‌సీపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజల్లోకి వెళ్లి, ప్రజలను మెప్పించి, ఒప్పించడానికి చేతకాక.. ఇలాంటి అక్రమ మార్గాలను ఎంచుకుని విజయం సాధించాలని టీడీపీ పావులు కదుపుతోంది. మరో వైపు వైఎస్సార్‌సీపీ ప్రజల్లోకి దూసుకెళుతూ ప్రజలకు తాము చేసిన సేవలను వివరిస్తూ ముందుకు వెళ్తున్నారు. వెరసి ప్రజలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి పూర్తి మద్దతు తెలుపుతుండటం విశేషం.

పకడ్బందీగా జెడ్పీటీసీ ఉప ఎన్నికల నిర్వహణ

- కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, ఎస్పీ అశోక్ కుమార్‌తో కలిసి జెడ్పీ సీఈవో, ఆర్వోలు, ఏఆర్వోలు నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ల మౌలిక వసతులు, మాన్ పవర్, ట్రైనింగ్ ప్రోగ్రామ్స్, సెక్యూరిటీ ఏర్పాట్లు, జిల్లా చెక్ పోస్టులు, కమ్యూనికేషన్ ప్లాన్స్, పోలింగ్ అధికారులు, పోలింగ్ రూట్స్, వెహికల్ రిక్వైర్మెంట్స్, పోలీస్ ఫోర్స్, చెక్ లిస్ట్, మెటీరియల్, స్వస్తిక్ గుర్తులు తదితర అంశాల కార్యాచరణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలింగ్ స్టేషన్ల వద్ద వెబ్ కాస్టింగ్, మొబైల్ కనెక్టివిటీ వంటి సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇప్పటికే నోడల్ అధికారులకు విధులు కేటాయించడం జరిగిందను. అన్ని పోలింగ్ స్టేషన్లను పరిశీలించాలన్నారు. ఎంసీసీ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనలు పక్కాగా అమలు చేయాలన్నారు. బ్యాలెట్ బాక్సులు, మెటీరియల్ ట్రాన్స్‌ఫర్ పక్కగా నిర్వహించాలన్నారు. వృద్ధులకు ర్యాంప్‌లు, వికలాంగులకు వీల్ చైర్స్ ఏర్పాటు చేయాలన్నారు.ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులకు ఆగస్టు 6న నలుగురు రిసోర్స్ పర్సన్స్‌తో ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పరిధిలో 12 చెక్ పోస్టులు, సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నైట్ పెట్రోలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, పులివెందుల ఏఆర్‌ఓ కృష్ణ మూర్తి, ఒంటిమిట్ట ఏఆర్‌ఓ సుజాతమ్మ, నోడల్ అధికారులు, తహసీల్దారులు పాల్గొన్నారు.

పులివెందులలో భయోత్పాతం!

- వివాహానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ నేతలపై హత్యాయత్నం
- తెలుగుదేశం పార్టీ కార్యాలయం సమీపంలో ఫంక్షన్ హాల్
- వేచియున్న వైఎస్సార్‌సీపీ నేతలపై మూకుమ్మడిగా దాడి
- సైదాపురం సురేష్‌రెడ్డి, అమరేష్‌రెడ్డిలను టార్గెట్ చేసిన బీటెక్ రవి అనుచరులు
- పరామర్శించిన కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి





టీడీపీ అల్లరి మూకల దాడిలో గాయపడిన సైదాపురం సురేష్‌రెడ్డి, అమరేశ్వరరెడ్డిలను పరామర్శిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ భయోత్పాతం సృష్టిస్తోంది. ప్రజామద్దతుతో నెగ్గలేమనే అంచనాకు వచ్చిన టీడీపీ.. పరువు కాపాడుకునేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది. వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసులు నమోదు మొదలు.. అనేక అక్రమాలకు పాల్పడుతోంది. మంగళవారం సాయంత్రం శ్రీకర్ ఫంక్షన్ హాల్‌లో ఓ వివాహానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నేతలపై నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి అనుచరులు హత్యాయత్నానికి పాల్పడ్డారు. తొండూరు మండలం సైదాపురం సురేష్‌రెడ్డి (చంటి), అమరేష్‌రెడ్డిలను లక్ష్యంగా చేసుకుని మారణాయుధాలతో దాడి చేశారు. బాధితులు, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తెలుగుదేశం పార్టీ కార్యాలయం సమీపంలో ఉన్న శ్రీకర్ ఫంక్షన్ హాల్ వద్ద వివాహం కోసం వేచియున్న సురేష్‌రెడ్డి, అమరేష్‌రెడ్డి, శ్రీకాంత్, నాగేష్, తన్మోహన్‌రెడ్డిలపై సుమారు 30 మంది టీడీపీ వర్గీయులు ఒక్కమారుగా దాడి చేశారు. వైఎస్సార్‌సీపీ నేతల్ని చుట్టుముట్టి మారణాయుధాలతో విచక్షణా రహితంగా కొట్టారు. అమరేష్‌రెడ్డి తలకు బలమైన గాయాలు కాగా, సురేష్‌రెడ్డి తలకు స్వల్ప గాయాలు అయ్యాయి. చేయి ఫ్యాక్చర్ అయ్యింది. అడ్డువచ్చిన ముగ్గుర్ని కూడా వదలకుండా దాడి చేశారు.

ఏమి మాట్లాడకుండానే విచక్షణా రహితంగా దాడి: వైఎస్సార్‌సీపీలో యాక్టివ్ రోల్ పోషించే నాయకులే లక్ష్యంగా టీడీపీ టార్గెట్ చేసిందని ఈ ఘటన రుజువు చేస్తోంది. పట్టణంలో సైదాపురం చంటి, అమరేష్‌రెడ్డి అండ్ టీమ్ యాక్టివ్‌గా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయం కోసం పని చేస్తున్నారు. వీరికి ఎలాంటి పాత గొడవలు కూడా లేవు. వైఎస్సార్‌సీపీ పార్టీకి వీరవిధేయులు.. అదొక్కటే ప్రధాన కారణమైంది. క్రియాశీలక నేతలపై దాడి చేయడంతో భయాందోళనతో వైఎస్సార్‌సీపీ కేడర్‌ను చిన్నాభిన్నం చేయాలనే దృఢ సంకల్పంతోనే ఈ ఘటనకు పాల్పడినట్లు బాధితులు వివరిస్తున్నారు. నిల్చొని ఉన్న వ్యక్తులపై అకారణంగా మాట కూడా మాట్లాడకుండా.. బీటెక్ రవి వర్గీయులు దాడి చేయడం వెనుక పులివెందులలో భయోత్పాతం సృష్టించే ఎత్తుగడగా పలువురు వెల్లడిస్తున్నారు.

బాధితుల్ని పరామర్శించిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల పట్టణం శ్రీకర్ ఫంక్షన్ హాల్ వద్ద టీడీపీ నేతల హత్యాయత్నం సంఘటనలో గాయపడ్డ బాధితులు సైదాపురం సురేష్‌రెడ్డి, అమరేష్‌రెడ్డి, శ్రీకాంత్, నాగేష్, తన్మోహన్‌రెడ్డిలను డాక్టర్ ఈసీ గంగిరెడ్డి ఆస్పత్రిలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చిన్నప్ప, రజనీకాంత్‌రెడ్డి తదితరులు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులపై స్థానిక వైద్యులతో చర్చించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కోలేక భౌతిక దాడులు ఎంచుకోవడాన్ని పలువురు తీవ్రంగా తప్పుబట్టుతున్నారు.

వ్యవస్థలు నిర్వీర్యం

పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయి. నిర్జీవంగా చేష్టలుగి కూర్చుండిపోయాయి. చిన్న జెడ్పీటీసీ ఎన్నికల కోసం కూటమి నేతలు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నా అడ్డుకునే సాహసం చేయడం లేదు. ఇప్పుడే ఇలాంటి పరిస్థితులు తలెత్తితే, ఎన్నికలు సమీపించేకొద్దీ మరెన్ని దుర్వార్తలు వినాల్సి వస్తోందోనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఏకపక్ష చర్యలు వీడి.. ఇకనైనా ప్రజాస్వామ్యబద్ధం ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సిద్ధం కావాలని పలువురు కోరుతున్నారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

- ఒంటిమిట్ట బరిలో 11 మంది
- పులివెందులలో 11 మంది

కడప సెవెన్‌రోడ్స్: ఒంటిమిట్ట, పులివెందుల జెడ్పీటీసీ స్థానాలకు జరగనున్న ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ఉపసంహరణ మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. పులివెందుల స్థానానికి 12 మంది, ఒంటిమిట్ట స్థానానికి 21 మంది తొలుత నామినేషన్లు సమర్పించారు. ఉపసంహరణల అనంతరం ఒంటిమిట్టలో 11 మంది, పులివెందులలో 11 మంది బరిలో ఉన్నారు.

- ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానానికి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి (వైఎస్సార్ కాంగ్రెస్), పూల విజయభాస్కర్ (కాంగ్రెస్), ముద్దుకృష్ణారెడ్డి (టీడీపీ), అరిగేల సౌమిత్రి చంద్రనాథ్, కోనేటి హరి వెంకట రమణ, గుండు మల్లికార్జునరెడ్డి, టక్కోలి శివారెడ్డి, నడివీధి సుధాకర్, వై.మధుమూర్తి, మామిళ్ల ఈశ్వరయ్య, వెంకటేశ్ నంద్యాల స్వతంత్రులుగా పోటీలో ఉన్నారు.
- పులివెందుల జెడ్పీటీసీ స్థానానికి తుమ్మల హేమంత్‌రెడ్డి (వైఎస్సార్ కాంగ్రెస్), మారెడ్డి లతారెడ్డి (టీడీపీ), మొయిళ్ల శివ కల్యాణ్‌రెడ్డి (కాంగ్రెస్), అంకిరెడ్డి సురేష్‌కుమార్‌రెడ్డి, తుమ్మనూరు అనిల్‌కుమార్‌రెడ్డి, నాగేళ్ల సాంబశివారెడ్డి, భూమిరెడ్డి రవీంద్రారెడ్డి, మారుజోళ్ల గజేంద్రనాథ్‌రెడ్డి, మారెడ్డి జయభారత్‌రెడ్డి, ముద్దిగారి వెంగళరెడ్డి, యాదటి సునీల్‌యాదవ్ స్వతంత్ర్య అభ్యర్థులుగా రంగంలో ఉన్నారు.

ఉప పోరు.. ప్రచార జోరు

- ముమ్మరంగా ఎన్నికల ప్రచారం
- మద్దతు తెలుపుతున్న ప్రజలు



ఓటు అభ్యర్థిస్తున్న వైఎస్ఆర్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి తుమ్మల హేమంత్ రెడ్డి



తుమ్మలపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



పులివెందుల మండలం తుమ్మలపల్లెలో ప్రచారంలో పెద్ద ఎత్తున పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు



జెడ్పీటీసీ అభ్యర్థి తుమ్మల హేమంత్ రెడ్డితో ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి



ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల, పార్టీ పరిశీలకులు కొండూరు అజయ్‌రెడ్డి

పులివెందుల: పులివెందుల మండలం జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రచారం జోరందుకుంది. ఆ పార్టీ నాయకులు గ్రామాల్లోకి ఎక్కడికి వెళ్లినా.. ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. మంగళవారం పులివెందుల మండల పరిధిలోని ఆర్.తుమ్మలపల్లె, రాయలాపురం, రచ్చుమర్రిపల్లె గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, రామసుబ్బారెడ్డి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తదితరులు ప్రచారం నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం ప్రారంభించారు. ఈ ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రచారానికి వెళ్లిన నాయకులకు.. అభిమానులు, ప్రజలు ఘన స్వాగతం పలుకుతూ, బాణా సంచా పేల్చుతూ సంబరాలు జరుపుకొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్.తుమ్మలపల్లె గ్రామ పంచాయతీలోని మూడు గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు స్వచ్ఛందంగా తమ ఊరు, ప్రాంతం అభివృద్ధి చెందిందంటే.. అది వైఎస్ కుటుంబ చలువేనని చెప్పుకొన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్ని ప్రలోభాలు పెట్టినా.. గత 40 ఏళ్ల నుంచి తమ గ్రామాలకు మేలు చేస్తున్న వైఎస్ కుటుంబానికే అండగా ఉంటామన్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ ఏ పథకం అమలు చేయలేదని వైఎస్సార్‌సీపీ నాయకులకు ప్రజలు తెలుపుతున్నారు. ఏడాదికి మూడు సిలిండర్లు అన్నారు కానీ, ఇప్పటి వరకు సిలిండర్ డబ్బులు తమ అకౌంట్‌లో జమ కాలేదన్నారు. తల్లికి వందనం ఇంట్లో ఉన్న అందరి పిల్లలకు అన్నారని, అనేక కొర్రీలు పెట్టి ఇవ్వలేదన్నారు. మహిళలకు ఏడాదికి రూ.18 వేలు అన్నారని, ఆ పథకం కూడా అమలు చేయలేదని వాపోయారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ ప్రజలు అన్ని గమనిస్తున్నారని వారే చంద్రబాబుకు తగిన విధంగా బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక చంద్రబాబు మోసానికి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజాయితీకి జరుగుతున్న ఎన్నికలు అని తెలిపారు. ఈ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అనైతిక కార్యక్రమాలకు పాల్పడుతోందని, ప్రజలు వారి చర్యలను గమనించి వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేయాలని కోరారు.

క్లుప్తంగా

8న అండర్-22 క్రీడల పోటీలు

కడప వైఎస్సార్ సర్కిల్ : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని శాప్ ఆదేశాల మేరకు ఈ నెల 8న అండర్-22 టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె.జగన్నాథరెడ్డి తెలిపారు. డాక్టర్ వైఎస్ క్రీడా పాఠశాలలో అర్చరీ, హాకీ వెయిట్ లిఫ్టింగ్(అన్ని విభాగాలు) పోటీలు, డీఎస్ఏ స్టేడియంలో అథ్లెటిక్స్, బాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు జరుగుతాయన్నారు. ప్రతి విభాగంలో విజేతగా నిలిచి ఎంపికైన జట్టు తిరుపతిలో ఈ నెల 11వతేదీ నుంచి 14వ తేదీ వరకు జరగనున్న జోనల్‌స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బెల్ట్ షాపులపై పోలీసుల దాడులు

లింగాల : మండలంలోని గుణకణపల్లెలో బెల్టు షాపులపై పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన లోమడ శ్రీనివాసులు ఇంట్లో సోదాలు నిర్వహించి 12 అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. శ్రీనివాసులును అరెస్టు చేశామని హెడ్ కానిస్టేబుల్ రాజు తెలిపారు.

యువకుడిపై దాడి కేసులో నలుగురు అరెస్టు

కడప అర్బన్ : కడప నగరంలోని తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో రవీంద్ర నగర్ గుర్రాల గడ్డకు వెళ్లే బుగ్గవంక దారి సమీపంలో ఈ నెల 3వ తేదీన చాంద్ బాషా అనే యువకుడిపై ఇస్మాయిల్, మరో ముగ్గురు కలిసి కత్తితో దాడి చేశారు. గాయపడిన చాంద్ బాషా రిమ్స్ లో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనలో ఎస్ఐ తాహిర్ హుస్సేన్ నిందితులైన ఇస్మాయిల్‌ను అరెస్టు చేసి, మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిని ప్రభుత్వ బాలుర గృహానికి తరలించారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

సిద్దవటం : మండలంలోని ఎస్టీ కాలనీకి చెందిన సు భాషిణి ఈ నెల 2వ తేదీ నుంచి కనిపించలేదని బంధువు గుర్రమ్మ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. గుర్రమ్మ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. ఎస్టీ కాలనీకి చెందిన సుభాషిణి టక్కోలు జెడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతోంది. ఈ నెల 2వతేదీ పాఠశాల ముగిసిన తరువాత ఆమె ఇంటికి రాలేదని బంధువులు తెలిపారు. తమ బంధువు కు బాగాలేదంటూ నమ్మించి వరుసకు మేనమా మ అయిన వ్యక్తి ద్విచక్ర వాహనంలో తీసుకెళ్లాడ ని వారు తెలిపారు. బాలిక బంధువు గుర్రమ్మ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్యాభర్తలపై దాడి

మదనపల్లె రూరల్ : స్థల వివాదం, వ్యక్తిగత కక్షలతో భార్యాభర్తలపై దాడిచేసిన ఘటన మంగళవారం కురబలకోట మండలంలో జరిగింది. నందిరెడ్డిగారిపల్లెకు చెందిన భార్యాభర్తలు అబ్దుల్‌బాషా(27), అమ్మాజాన్(22)లపై అదే ప్రాంతానికి చెందిన మహబూబ్‌బాషా, చాంద్‌బాషా, నస్నీబీలు దాడికి పాల్పడ్డారు. దాడిలో భార్యాభర్తలు గాయపడగా, స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఎన్నికలకు దూరంగా సహకారం

- నామినేటెడ్ పదవులతో సరి
- ఏడాదిగా అతిగతీ లేని వైనం



పోరుమామిళ్లలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్

కాశినాయన : వ్యవసాయ రంగం అభివృద్ధి కంటే రాజకీయంగా పదవుల పందేరానికి సహకార వ్యవస్థ దోహదపడుతోందనే ఆరోపణలున్నాయి. త్రీమెన్, ఫైవ్‌మెన్ కమిటీలను వేస్తూ రైతులకు తూతూ మంత్రంగా సేవలు అందిస్తున్నారు. ప్రశ్నించే వారే లేకపోవడంతో కొన్ని చోట్ల సిబ్బంది ఇష్టారాజ్యంగా అవినీతికి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు గతంలో సహకార వ్యవస్థను తీసుకొచ్చారు. సహకార పరపతి సంఘాలను ఏర్పాటుచేసి వాటిద్వారా రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా పాలకవర్గాలను ప్రతి ఐదేళ్లకోసారి ఎన్నుకోవడం క్రమేణా జరుగుతోంది. 2013 ఫిబ్రవరిలో నిర్వహించిన ఎన్నికల తర్వాత ఇంతవరకూ తిరిగి ఎన్నికలు జరగలేదు. దాదాపు 12ఏళ్లుగా ఎన్నికలు జరగకపోవడంతో సహకార వ్యవస్థ లక్ష్యానికి దూరంగా వెళుతోందని విమర్శలున్నాయి. ఈ క్రమంలో పట్టించుకునేవారే కరవయ్యారు. ఉమ్మడి కడప జిల్లాలో 77 సహకార సంఘాలున్నాయి. వాటికి మొన్నటి వరకు త్రీసభ్య కమిటీలుండేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాది కాలంగా కమిటీలను వేయలేదు. ఐదేళ్లకోసారి ఎన్నికలు జరుగుతూ ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వ్యవసాయరంగం అభివృద్ధికి ప్రత్యేక నిధులు వచ్చేవి. పాలక వర్గాలు లేకపోవడంతో ఈ నిధులు మంజూరుకావడం లేదు. నిధులు రాక రైతులకు అందించే రుణాల్లో రాయితీలు దక్కని పరిస్థితి నెలకొంది. అంతేగాక వ్యవసాయ రంగానికి తోడ్పాటును అందించేలా పంపిణీ చేసే ఎరువులు, పురుగు మందులు, యంత్ర పరికరాలు, వ్యవసాయ పనిముట్లను రైతులు పొందలేకపోతున్నారు.

పాలకుల సిఫారసుతోనే...

సహకార సంఘాలకు ఏ కారణాలతో ఎన్నికలు నిర్వహించడం లేదనేది చెప్పేవారే లేరు. అధికారులు మాత్రం పాలకుల నిర్ణయం మేరకు పనిచేయాల్సి ఉంటుందని, ఇంతకు మించి వివరణ ఇవ్వలేమంటూ సమాధానం దాటవేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాలకవర్గాల స్థానంలో నియమించే కమిటీలు ఆయా ప్రాంతంలోని ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల సిఫారసులతోనే ఏర్పడుతున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇంతవరకూ కమిటీలను ఎందుకు వేయలేదో అర్థం కావడంలేదు. రేపు మాపు అంటూ ఏడాది గడిపేశారు. ఈ పదవులపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆశావాహుల ఆశలు నెరవేరడం లేదని వాపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న 77 సహకార సంఘాలకు నామినేటెడ్ పద్ధతిలో కమిటీలను వేసేందుకు సంబంధిత ప్రాంతాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలతో ప్రక్రియ జరుగుతోందని ప్రచారం జరుగుతోంది. వారం పది రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తవుతుందని అధికార పార్టీ నాయకులు అంటున్నట్లు సమాచారం.

విషగుళికలు తిని వ్యాపారి ఆత్మహత్య



మృతి చెందిన ఉండేల పెద్దఓబులరెడ్డి



పెద్ద ఓబులరెడ్డి చేతిపై రాసుకున్న దృశ్యం

ప్రొద్దుటూరు : పట్టణంలోని బాక్రాపేట వీధికి చెందిన వేరుశనగకాయల వ్యాపారి ఉండేల పెద్ద ఓబుళరెడ్డి (55) విష గుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ శివారులోని కంపోస్టు యార్డులో పెద్ద ఓబుళరెడ్డి వేరుశనగ మిల్లు నిర్వహిస్తున్నాడు. పలువురు వ్యాపారుల వద్ద వేరుశనగ కాయలు తెచ్చి వ్యాపారం సాగించాడు. అప్పుల భారంతో మంగళవారం ఉదయం తన మిల్లులోనే విష గుళికలు మింగాడు. పరిస్థితి విషమించడంతో అతనిని స్థానిక హోమస్‌పేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పెద్ద ఓబుళరెడ్డి మృతి చెందాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో తనపై జరిగిన దాడి సంఘటనను పెన్నుతో చేతిలో రాసుకున్నట్లు గుర్తించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమార్తెలకు వివాహం చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు ఎర్రచందనం దొంగల అరెస్ట్

చాపాడు : మండలంలోని మైదుకూరు-ప్రొద్దుటూరు జాతీయ రహదారిలో ఖాదర్‌పల్లె క్రాస్ రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం ముగ్గురు ఎర్రచందనం దొంగలను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. గత నెల 23న ప్రొద్దుటూరు నుంచి ఎర్రచందనం దుంగలను కారులో తరలిస్తుండగా పట్టుకున్నామని తెలిపారు. ముగ్గురు పారిపోగా, ఇద్దరు దొంగలను పట్టుకుని దుంగలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అనంతరం పారిపోయిన ప్రొద్దుటూరుకు చెందిన కందుకూరి బాల దస్తగిరి, ఖాదర్‌పల్లెకు చెందిన షేక్ లాల్‌బీ, హైదరాబాద్‌కు చెందిన హేమంత్‌సింగ్ సోలంకిలను ఖాదర్‌పల్లె క్రాస్ రోడ్డు వద్ద అరెస్టు చేశామని తెలిపారు. మంగళవారం సాయంత్రం కోర్టులో హాజరుపరచినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య చెప్పారు.

పసివాడిపై చోరీ ముద్ర

పారిపోయిన వచ్చాడని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగింత

మైదుకూరు : పారిపోయి వచ్చిన బాలుడిపై చోరీముద్ర వేసి ఓ వ్యక్తి చేసిన హడావిడి చివరకు ఆ బాలుడిని తల్లిదండ్రుల వద్దకు చేర్చింది. అనంతపురం జిల్లా గుత్తికి చెందిన కావడి సతీష్, రూత్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు కుమారుడు ఉన్నారు. 12 ఏళ్ల బాలుడు ఐదో తరగతి చదువుతున్నాడు. సోమవారం భార్యభర్తలు ఇరువురు ఇంటిలో గొడవ పడ్డారు. ఆ సమయంలో ఇంటిలో ఉన్న కుమారుడిపై తల్లి రూత్ గట్టిగా కేకలు వేసింది. బాధపడిన బాలుడు ఇంటి నుంచి పారిపోయి వచ్చాడు. మంగళవారం ఉదయం మైదుకూరు ఆర్టీసీ బస్టాండ్‌లో కర్నూలు-తిరుపతి సర్వీసు బస్సులో డబ్బు కోసం ప్రయాణికులను యాచిస్తున్నాడు. అదే సమయంలో మైదుకూరుకు చెందిన ఖాజా అనే వ్యక్తి తిరుపతి వెళ్లేందుకు బస్సు ఎక్కాడు. కొంతసేపటికి తన సెల్‌ఫోన్ కనిపించలేదని హడావుడి చేసిన ఖాజా తన సెల్‌ఫోన్‌ను దొంగలించాడని ఆ పిల్లవాణ్ణి పట్టుకున్నాడు. తాను దొంగలించలేదని బాలుడు ఏడుస్తూ చెప్పాడు.బాలుడిని బస్సు నుంచి కిందకు దించి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాడు. అది గమనించిన మైదుకూరు డిపోకు చెందిన జనరల్ ఏడీసీ ఎం.లక్ష్మయ్య స్టేషన్‌కు చేరుకుని బాలుడితో మాట్లాడారు. బాలుడు చెప్పినదంతా విని ఈ అబ్బాయి సెల్‌ఫోన్ దొంగలించి ఉండడన్నారు. బాధితునితో సెల్ నంబర్‌ను చెప్పించుకుని ఆ నంబర్‌కు ఫోన్ చేశారు. ఖాజా సెల్‌ఫోన్‌ను కర్నూలు-తిరుపతి బస్సులో ఉన్న ఓ వ్యక్తి ఎత్తి మాట్లాడాడు. ఎవరిదో సెల్ ఫోన్ సీట్‌పై పడి ఉండగా తీసి తన వద్ద ఉంచుకున్నట్టు ఆ వ్యక్తి చెప్పాడు. అది మైదుకూరుకు చెందిన ఓ వ్యక్తిదని, దయచేసి దానిని కడప బస్టాండ్‌లోని ఎంక్వైరీ వద్ద డ్యూటీలో ఉన్న వంశీ అనే వ్యక్తికి అందజేయాలని ఏడీసీ లక్ష్మయ్య కోరారు. ఫోన్ బస్సులో జారి పడగా చూసుకోకుండా బాలుడిపై నిందలు వేసినందుకు పోలీసులు ఖాజాను మందలించి పంపారు. ఏడీసీ లక్ష్మయ్య బాలుడిని తీసుకువెళ్లి టిఫిన్ పెట్టించారు. తర్వాత బాలుడి తల్లి రూత్ నంబర్‌ను తీసుకొని ఆమెతో మాట్లాడారు. మీ అబ్బాయి మైదుకూరులో తమ వద్ద క్షేమంగా ఉన్నాడని చెప్పారు. తన కుమారుడిని తమ వద్దకు పంపాలని ఆమె అభ్యర్థించింది. ఆ మేరకు నెల్లూరు-అనంతపురం సర్వీస్ బస్సులో ఎక్కించిన లక్ష్మయ్య టికెట్ తీయించి రూ.360ను అతని జేబులో ఉంచారు. సాయంత్రం తన కుమారుడు ఇంటికి చేరుకోగానే తల్లి రూత్ సంతోషంతో ఏడీసీ లక్ష్మయ్యకు ఫోన్ చేసి కృతజ్ఞతలు తెలిపారు. బాలుడి పరిస్థితిపై జాలిపడి చొరవ చూపి అతడిని నిర్దోషిగా తేల్చి తిరిగి తల్లిదండ్రుల వద్దకు చేర్చి మానవత్వాన్ని చూపిన ఆర్టీసీ అధికారి లక్ష్మయ్య అందరి మన్ననలను అందుకున్నారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రవీంద్రనాథ్

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఖరారు చేసిన షెడ్యూల్ మేరకు 2025-26 విద్యా సంవత్సరానికిగానూ ప్రథమ సంవత్సరం డిగ్రీ కోర్సులలో ప్రవేశాల కొరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆగష్టు 18వ తేదీ నుంచి కళాశాలలో రిజిస్ట్రేషన్లు మొదలవుతాయని తెలిపారు. జిల్లాలో, జిల్లా బయట ఇంటర్మీడియట్ లేదా తత్సమాన కోర్సు పూర్తి చేసిన విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆగష్టు 21 నుంచి 23వ తేదీ వరకు ప్రత్యేక కేటగిరీ పత్రాల పరిశీలన, 21 నుంచి 24వ తేదీవరకు కళాశాలల ఎంపికకు వెబ్ ఆప్షన్ల నమోదు, 25వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల మార్పుకు అవకాశం ఉంటుందన్నారు. కళాశాల బోధన, బోధనేతర సిబ్బందిచే విద్యార్థుల కోసం కళాశాలలో సహాయ కేంద్రం ఏర్పాటుచేసినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఆగష్టు 27న సీట్లను కేటాయిస్తారని, 28వ తేదీ నుంచి తరగతులు ప్రారంభిస్తారని తెలిపారు.

పోలీస్ శిక్షణా కేంద్రం పరిశీలించిన ఎస్పీ



శిక్షణ కేంద్రం పరిశీలిస్తున్న ఎస్పీ ఈజీ.అశోక్ కుమార్

కడప అర్బన్ : కడప శివారులోని పోలీస్ శిక్షణా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల(ఎస్‌సీటీపీసీ)కు శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలోడీటీసీ పరిసర ప్రాంతాలు, మౌలిక వసతులు, బ్యారక్‌లు, కిచెన్, జిమ్, తరగతి గదులు, పరేడ్ గ్రౌండ్‌ను చూసి త్వరితగతిన శిక్షణకు పూర్తి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అనంతరం శారీరక శిక్షణ, పరేడ్ ప్రాక్టీస్, ఇతర శిక్షణ కార్యక్రమాలకు ఉపయోగపడే మైదానం, క్లాస్ రూమ్స్, రన్నింగ్ ట్రాక్, పరేడ్ గ్రౌండ్స్, డ్రిల్ ఏరియా, బాటిల్ అబ్స్టాకల్స్‌ను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. శిక్షణ కేంద్రంలో వసతి సదుపాయాలు ఏర్పాటుచేసుకోవాలని, మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు. డీటీసీ డీఎస్పీ అబ్దుల్‌కరీం, డీటీసీ ఇన్‌స్పెక్టర్ ఎస్.వినయ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతోనే ఏకాగ్రత, మానసిక ప్రశాంతత సాధ్యం



యోగా చేస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయినులు

కడప ఎడ్యుకేషన్ : మానసిక ఒత్తిడి నుంచి బయటపడి శారీరక దృఢత్వంతోపాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పొందేందుకు విద్యార్థులకు యోగా ఔషధం లాగా పనిచేస్తుందని విద్యాశాఖ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ దేవరాజు అన్నారు. వృత్యంతర శిక్షణలో భాగంగా కడప నగర శివారులోని గ్లోబర్ ఇంజినీరింగ్ కళాశాలలో కేజీబీవీల ఉపాధ్యాయులకు మంగళవారం యోగాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దేవరాజు మాట్లాడుతూ ఉపాధ్యాయినులు యోగాపై అవగాహన పెంచుకుని కేజీబీవీ విద్యార్థినులకు నేర్పించాలన్నారు. సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నిత్యానందరాజు మాట్లాడుతూ యోగా నిర్వహించడంతో శారీరక, ఆరోగ్య సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. అనంతరం యోగా ట్రైనర్ శ్రీలక్ష్మి ఉపాధ్యాయినులకు యోగాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ వీరేంద్ర, అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ సంజీవరెడ్డి, అఖిల్, అనూష, వింధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు భారతి విద్యార్థి ఎంపిక



నరేష్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ కిషోర్‌కుమార్

కమలాపురం : మండలంలోని నల్లలింగాయపల్లెలోని డీఏవీ భారతి పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి ఎంవీ.నరేష్ రాష్ట్ర స్థాయి జావెలిన్ త్రో పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శివ్వం కిషోర్‌కుమార్ తెలిపారు. విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌లోని డీఏవీ భారతి పాఠశాల విద్యార్థులు ఈ నెల 3న ప్రొద్దుటూరు మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొన్నారు. జావెలిన్ త్రోలో నరేష్ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ నెల 9వ తేదీ నుంచి 11వతేదీ వరకూ బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో నరేష్ పాల్గొంటారని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ సందర్భంగా పరిశ్రమ సీఎంఓ సాయిరమేష్, హెచ్ఆర్ హెడ్ గోపాల్‌రెడ్డి, ఐఆర్ అండ్‌పీఆర్ హెచ్.భార్గవ్ రెడ్డి, డీఏవీ ప్రాంతీయ అధికారి శేషాద్రి విద్యార్థితో పాటు పీడీ రామచంద్రను అభినందించారు.

ఓటమి భయంతోనే వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

కడప కార్పొరేషన్ : పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఓటమి తప్పదని భావించి వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఆరోపించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల టీడీపీలో చేరిన పులివెందుల మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డిని వైఎస్.భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఎంపీ వైఎస్.అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డిలు పార్టీలోకి రావాలని సముదాయించేందుకు ప్రయత్నించారన్నారు. భాస్కర్‌రెడ్డి ఫోన్ చేస్తే విశ్వనాథరెడ్డి ఫోన్ ఎత్తలేదని.. ఈ మాత్రానికే బెదిరించినట్లు కేసుపెట్టడం దారుణమన్నారు. వైఎస్.భాస్కర్‌రెడ్డి, దేవిరెడ్డి శంకర్‌రెడ్డిల బెయిల్ రద్దు చేయాలని సీబీఐని కోరుతామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి మాట్లాడటాన్ని బట్టి చూస్తే వారి కుట్ర బయటపడుతోందన్నారు. ఆచ్చివెళ్లి ఎస్సీ కాలనీకి చెందిన వారిని బలవంతంగా టీడీపీలో చేర్చుకున్నారని దళితులు చెబితే ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు. శాంతియుతంగా ఇంటింటి ప్రచారం చేస్తుంటే ఓటమి భయంతో టీడీపీ నేతలు అక్రమ కేసులకు తెరతీశారన్నారు. ఈకార్యక్రమంలో షేక్ షఫీ, బి.సుబ్బరాయుడు, ఎస్.వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

సాయుధ పోలీసు బలగాల ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్ మార్చ్‌లో సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది

పులివెందుల : ఈ నెల 12వతేదీన నపులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం సాయుధ బలగాలతో పోలీసు అధికారులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రశాంత, స్వేచ్ఛాయుత ఎన్నిక లక్ష్యంగా రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకునేలా ప్రజలకు భరోసా కల్పిస్తూ కనంపల్లె, నల్లపురెడ్డిపల్లె, ఆర్.తుమ్మలపల్లె గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఎవరైనా ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పులివెందుల సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రసవత్తరంగా విద్యుత్ ఉద్యోగుల క్రీడల పోటీలు

కడప కార్పొరేషన్ : విద్యుత్ ఉద్యోగుల క్రీడా పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. స్థానిక జోనల్ ఆఫీసు మైదానంలో జరిగిన ఈ క్రీడల్లో వాలీబాల్‌లో కడప, కర్నూలు జట్లు తలపడగా కర్నూలు జట్టు విజయం సాధించింది. బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో కడప జట్టు విజయం సాధించింది. మహిళా ఉద్యోగినులకు చెస్, క్యారమ్స్ నిర్వహించారు. ఏపీ ట్రాన్స్ కో చీఫ్ ఇంజినీర్ క్రిష్ణ కుమార్ ఈ క్రీడా పోటీలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ శ్రీరామచంద్రమూర్తి, స్పోర్ట్స్ సెక్రటరీ మస్తాన్, వీరాంజనేయులు, కల్చరల్ సెక్రటరీ వీరభద్రయ్య, వెంకట సుబ్బయ, శరణ్ పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు



చెస్ ఆడుతున్న మహిళా ఉద్యోగినులు

అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం



రాజ్యలక్ష్మి, పంచాయితీ అధికారి

కడప కార్పొరేషన్ : జిల్లాలోని అన్ని పంచాయితీలలో అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని జిల్లా పంచాయితీ అధికారి జి.రాజ్యలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. విక్రయ ఒప్పందం లేదా హక్కు పత్రంతో ఉన్న అనధికార లే అవుట్‌కు 90 రోజుల్లో వ్యక్తిగతంగా రెగ్యులైజేషన్ స్కీం(ఎల్‌ఆర్ఎస్)కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆగష్టు 4వ తేదీ నుంచి ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్ ఓపెన్‌లో ఉంటుందన్నారు. ఓపెన్ స్పేస్ చార్జీలు 45 రోజుల్లో పూర్తిగా చెల్లిస్తే పది శాతం, 90 రోజుల్లో చెల్లిస్తే 5 శాతం పెనాల్టీ తగ్గింపు ఉంటుందన్నారు. ఇప్పటికే ఐపీఎల్‌పీ ఆమోదింపబడిన దరఖాస్తులకు ప్రాధాన్యం ఇవ్వబడుతుందని, కొత్తగా వచ్చిన దరఖాస్తులను తక్షణం పరిష్కరించడం జరుగుతుందన్నారు. వివరాలకు 9849966639 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

'రండి.....టీ తాగుతూ మాట్లాడుకుందాం'

ప్రభుత్వ ఉద్యోగుల వినూత్న కార్యక్రమం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షులు సూర్యనారాయణ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం కడప ఇరిగేషన్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉద్యోగుల సమస్యలను ఒక వీడియో రూపంలో ఉద్యోగుల ముందుకు తీసుకు రావడం జరుగుతోంది. ఏపీజీఈఏ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు ఉద్యోగుల హక్కులపై అందరినీ చైతన్యపరిచి ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేలా కృషి చేయడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు కృష్ణప్రసాద్, సుదర్శన్‌రెడ్డి, బీవీ చంద్రశేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జేసీ అదితిసింగ్, ఎస్పీ అశోక్‌కుమార్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడుతో కలిసి అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15న స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకల్లో.. జెండా వందన వేదికను అలంకరించాలని, ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర సమర యోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిథులను ఆహ్వానించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటుచేయాలని మునిసిపల్ కమిషనర్‌ను, ఆహ్వాన పత్రికలు, ప్రోటోకాల్ అంశాలపై జాగ్రత్తగా ఉండాలని డీఆర్ఓను ఆయన ఆదేశించారు. శకటాలు, ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటుచేయాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ఆదేశించారు.ఉత్తమ అధికారులు, సిబ్బంది, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేయడానికి ప్రతిపాదిత జాబితాను నిర్ణీత గడువులోపు అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి, సీపీవో హజ్రతయ్య, అధికారులు రాజ్యలక్ష్మి, ఆదిశేషారెడ్డి, కిరణ్‌కుమార్, చంద్రనాయక్, నాగరాజు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి హామీలకు త్వరలోనే కార్యరూపం

కడప సెవెన్‌రోడ్స్ : జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువులో రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి చర్యలు చేపట్టారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన పలు నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీ4 ఫౌండేషన్ కార్యక్రమానికి మరింత బలం చేకూరేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కొంతమంది అర్జీదారులకు పరిష్కార నివేదిక అందివ్వగా, మరికొందరు బంగారు కుటుంబాలకు మార్గదర్శుల ద్వారా అందాల్సిన సహాయాన్ని సత్వరమే అందించేందుకు కార్యాచరణ మొదలెట్టారు. ఈ నెల 1న జమ్మలమడుగులోని గూడెం చెరువు గ్రామంలో ఇంటింటికి వెళ్లి నేరుగా లబ్ధిదారులకు పెన్షన్ పంపిణీ చేసిన సందర్భంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అర్జీలను అందజేశారు. ఆ అర్జీల పరిష్కరించేందుకు అభ్యర్థనలను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు.